కానిస్టేబుల్ కొలువుల్లో
మెరిసిన కుటుంబాలు

- ఉద్యోగాలు సాధించిన రక్తసంబంధీకులు
- ఒకే ఊరి నుంచి చాలా మందికి జాబ్స్
- భార్యాభర్తలకూ సర్కారు కొలువులు
- హర్షం వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

చిలువేరు వినీత, చిలువేరు శ్రీకాంత్

నర్సంపేట రూరల్, అక్టోబర్ 5 : ఇటీవల వెల్లడించిన కానిస్టేబుల్ ఫలితాల్లో పలు చోట్ల కుటుంబ సభ్యులే కొలువులు దక్కించుకున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. నర్సంపేట మండలం కమ్మపల్లి గ్రామానికి చెందిన దళిత నిరుపేద కుటుంబంలో అన్నాచెల్లెళ్లు ఇద్దరికి పోలీస్ ఉద్యోగాలు వరించాయి. చిలువేరు రమ-రవి దంపతులకు ముగ్గురు పిల్లలు. కూలీ పనులు చేసుకుంటూ వారిని ఉన్నత చదువు చదివించారు. ఈ క్రమంలో రెండో కుమారుడు శ్రీకాంత్, కుమార్తె వినీత ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నారు. పట్టుదలతో చదివి ప్రతిభ కనబర్చి వినీత సివిల్ కానిస్టేబుల్‌గా, శ్రీకాంత్ జైల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించారు. ఒకే కుటుంబంలో ఇద్దరు ఉద్యోగాలు సాధించగా జడ్పీటీసీ కోమాండ్ల జయ-గోపాల్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ వల్గుబెల్లి రంగారెడ్డి, ఎంపీటీసీ వల్గుబెల్లి విజయ-ప్రతాప్‌రెడ్డి వారిని అభినందించారు.

ఖాదర్‌పేట నుంచి భార్యాభర్తలు..

పెంతల రాజేందర్-కల్పన

చెన్నారావుపేట : మండలంలోని ఖాదర్‌పేట గ్రామానికి చెందిన పెంతల రాజేందర్-కల్పన దంపతులు సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. వీరిది ఒక సాధారణ వ్యవసాయ కుటుంబం. రాజేందర్‌కు సంగెం మండలం మొడ్రాయి గ్రామానికి చెందిన కల్పనతో సంవత్సరం క్రితం వివాహమైంది. రాజేందర్ ఫార్మా డీ కోర్సు పూర్తి చేయగా, కల్పన ఎమ్మెస్సీ పూర్తి చేసింది. వీరు ఏడాది నుంచి కష్టపడి చదివి ఉద్యోగం సాధించినట్లు తెలిపారు. భార్యాభర్తలిద్దరూ మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించడంతో స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

చిన్న వయసులో కానిస్టేబుల్..

చారాల రవళి

దుగ్గొండి : దుగ్గొండి మండలం రేఖంపల్లికి చెందిన ఓ యువతి చిన్న వయసులోనే సివిల్ కానిస్టేబుల్, ఏబీఎస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించింది. గ్రామానికి చెందిన చారాల సత్యంచారి- అరుణ దంపతుల కుమార్తె రవళి ఇటీవల జరిగిన పోలీసు ఉద్యోగ పరీక్ష రాసింది. 22 ఏళ్ల వయసులోనే తన మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించి అందరితో శభాష్ అనిపించుకుంది. తండ్రి వడ్రంగి పని చేస్తు, తల్లి పిండి గిర్ని పట్టుకుంటూ ఎంతో కష్టపడి ఆమెను చదివించారు. వారి ఆర్థిక పరిస్థితులను చూసి రవళి ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివింది. భవిష్యత్‌లో ఉన్నత పోలీస్ ఉద్యోగం సాధిస్తానని తెలిపింది.

గురిజాల నుంచి నలుగురు..

వినయ్‌గౌడ్ అనిల్ సృజన్ శ్రావ్య

నర్సంపేటరూరల్ : మండలంలోని గురిజాల గ్రామంలో నలుగురు అభ్యర్థులు పోలీస్‌కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. దీంతో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. సివిల్ కానిస్టేబుల్‌గా పొదిల శ్రావ్య, ఫైర్ కానిస్టేబుల్స్‌గా జనగాం వినయ్, అల్లి అనిల్, టీఎస్ఎస్‌పీ కానిస్టేబుల్‌గా బండారి సృజన్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురిజాల ఉద్యోగుల ఐక్యవేదిక అధ్యక్షుడు గొలనకొండ వేణు, ప్రధాన కార్యదర్శి చుక్క రాజేందర్‌గౌడ్‌తో పాటు పలువురు వారిని అభినందించారు. పోలీస్‌కానిస్టేబుల్స్‌గా ఎంపికైన అభ్యర్థులు నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంపై గ్రామ ప్రజలు సైతం వారిని అభినందించారు.

నేటి మంత్రి కేటీఆర్ పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

- రూ.900 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమీక్ష

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ, అక్టోబర్ 5 : జిల్లాలో శుక్రవారం రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మంత్రి పర్యటన సందర్భంగా గురువారం సాయంత్రం హనుమకొండ కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్న నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు ఏర్పాట్లు పక్కగా చేయాలని ఆదేశించారు. మంత్రి హైదరాబాద్ నుంచి నేరుగా ఆర్ట్స్ కాలేజీకి చేరుకొని రూ.900 కోట్ల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం కార్యక్రమాలు చేపడుతారన్నారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. ప్రతి కార్యక్రమానికి సంబంధిత శాఖ అధికారిని నోడల్ అధికారిగా నియమించామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ మహేందర్ జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, ఏసీపీ బారీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

వరంగల్ : రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ నగర పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు మంత్రి కేటీఆర్ పర్యటించే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. ల్యాండ్రోమార్ట్, అలంకార్ జంక్షన్ల పరిశీలించిన మేయర్ సుధారాణి అధికారులకు పలు సూచనలు చేశారు. సుబేదారి ఆర్ట్స్ కళాశాల మైదానంలోని హెలిప్యాడ్ ఏర్పాట్లను కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. మడికొండలో ప్రారంభించనున్న క్వాడ్‌రాంట్ ఐటీ టెక్నాలజీస్, ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్ ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులకు కేసీఆర్ బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని మంత్రి కేటీఆర్ లష్కర్ బజార్ ప్రభుత్వ పాఠశాలలో ప్రారంభించనున్నారు. దీంతో పాఠశాలను సందర్శించి, ఏర్పాట్లు చూశారు. అక్కడ ఏర్పాట్లు చేస్తున్న అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. మంత్రి కేటీఆర్ పర్యటనలో ఏర్పాట్లు లోటు జరుగకుండా చూడాలన్నారు. ఖిలావరంగల్‌లో జరిగే సంక్షేమ సభలో తాగునీటి వసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు, సీటింగ్, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలన్నారు. శానిటేషన్, అర్బన్ మలేరియా, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాలు సమన్వయంతోపనిచేయాలన్నారు. వారి వెంట ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సీపీ వెంకన్న, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, హెచ్‌వో రమేశ్, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్, సంజయ్‌కుమార్ ఉన్నారు.

కేటీఆర్ పర్యటన ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, మేయర్ సుధారాణి

బీఆర్ఎస్‌తోనే మహిళా సాధికారత

- రాష్ట్రంలో ఆడబిడ్డల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి
- మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం
- అతివల రక్షణకు ప్రత్యేక చర్యలు
- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు

నర్సంపేట, అక్టోబర్ 5: బీఆర్ఎస్ సర్కారుతోనే మహిళా సాధికారత సాధ్యమని, అందుకోసం సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం నర్సంపేటలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో వీవో భవనాల నిర్మాణాల కోసం నిధుల ప్రొసీడింగ్ కాపీలను మహిళలకు అందించారు. అలాగే, 500 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. అంతేకాకుండా లబ్ధిదారులకు బతుకమ్మ చీరెలు అందించారు. నర్సంపేట నియోజకవర్గంలోని 197 గ్రామాల యువతకు క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. అంతేకాకుండా అఫిషియల్ ప్రోగ్రామ్స్ అండ్ డయిలీ షెడ్యూల్ అప్‌డేట్ మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. తర్వాత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 3176 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్ది మాట్లాడుతూ గత ప్రభుత్వాలు మహిళల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఆడబిడ్డల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. అతివలకు అన్ని రంగాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. మహిళల రక్షణకు రాష్ట్ర సర్కారు ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. నర్సంపేట నియోజకవర్గంలో మహిళల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే పెద్ది చెప్పారు. డివిజన్‌వ్యాప్తంగా 3500 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి, ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. మహిళలకు అన్ని రకాల రుణాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

దమ్మున్న నేత ఎమ్మెల్యే పెద్ది

దమ్ము, ధైర్యం ఉన్న నేత ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆయన ఈ ప్రాంతానికి ఎమ్మెల్యేగా ఉండడం నర్సంపేట నియోజకవర్గ ప్రజల అదృష్టమన్నారు. పెద్ది ఒక దఫా ఎమ్మెల్యేగా గెలిచినందుకే నర్సంపేట రూపురేఖలు మారిపోయాయన్నారు. పెద్ది ప్రత్యేక విజన్‌తో ముందుకెళ్తున్నారని కొనియాడారు. నర్సంపేట డివిజన్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గానికి సీఎం కేసీఆర్‌తోపాటు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఎంతో తోడ్పాటునందించారని తెలిపారు. మరోసారి పెద్దిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాష్ట్రంలోనే నర్సంపేట నంబర్‌వన్ స్థాయికి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న, జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజినీకిషన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, క్లస్టర్ బాధ్యులు, ఆర్‌బీఎస్ సభ్యులు, ఏపీఎంలు, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్లు పాల్గొన్నారు.

వీవో భవనాలకు ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తున్న పెద్ది, పోచంపల్లి

ప్రొఫెసర్ రామస్వామిని సన్మానిస్తున్న వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

రామస్వామికి వీసీ అభినందన

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 5 : కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత బయోటెక్నాలజీ విభాగం, అడ్జెంక్ట్ ఫాకల్టీ ప్రొఫెసర్ ఎన్.రామస్వామి యునైటెడ్ కింగ్‌డంలోని ప్రతిష్టాత్మక రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ వారి ఫెలోషిప్‌నకు ఎంపికైన సందర్భంగా కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆయనను అభినందించారు. రామస్వామిని శాలువా, జ్ఞాపికతో సన్మానించారు.

'జామ్' పరీక్షపై అవగాహన

హనుమకొండ చౌరస్తా/హనుమకొండ, అక్టోబర్ 5 : హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాలతోపాటు సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాలలో జామ్ పరీక్షపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ స్థాయిలో పేరుగాంచిన ఐఐటీ, ఎన్ఐటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే ఈ పరీక్షపై అవగాహన కల్పించారు. ఈ సదస్సుల్లో ప్రధానవక్తగా మద్రాస్ ఐఐటీకి చెందిన ప్రొఫెసర్ బైరి బీరయ్య పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరీక్ష విధానం, ప్రిపరేషన్ గురించి వివరించారు. ఈ నెల13న నిర్వహించనున్న జామ్ ప్రవేశ పరీక్షకు ఎక్కువ మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకొని తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ బీ రమేశ్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ సంజీవయ్య, అధ్యాపకులు వేణుగోపాల్, బండారి రాజు, వెంకన్న, కందాల సత్యనారాయణ, వెంకటేశ్, మసూద్, అశోక్, ప్రభాకర్, నరేందర్‌రెడ్డి, మురళీధర్ పాల్గొన్నారు. అలాగే, ఆర్ట్స్ కాలేజీలో జరిగిన సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హన్మంతు, గణిత విభాగ అధ్యాపకులు డాక్టర్ టీ నాగయ్య, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ మంజుల, డాక్టర్ శ్రీలత, రాజ్‌కుమార్, పీఆర్‌వో డాక్టర్ ఆదిరెడ్డి పాల్గొన్నారు.